## డిజిట్-మెరిట్

# రూ.12,93,463 కోట్లు



2022-23 రాష్ట్ర జీఎస్‌డీపీ మొత్తం. 2014-15తో పోలిస్తే మూడింతలు పెరిగిన వృద్ధి.


## థర్డ్ అంపైర్



వ్యవసాయ రుణమాఫీ కంటే, తెలంగాణలో అమలు చేస్తున్న 'రైతుబంధు' వంటి ప్రత్యక్ష నగదు బదిలీ పథకం ఎంతో గొప్పది. తెలంగాణలో వ్యవసాయ స్థిరీకరణకు ఈ పథకం ఎంతగానో దోహదం చేసింది.

▪ అరవింద్ సుబ్రమణ్యన్
ప్రధాని మాజీ ఆర్థిక సలహాదారు

## థౌజండ్ వాలా..





కౌంట్ డౌన్ 15

హైదరాబాద్ | బుధవారం 15 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

www.ntnews.com

I




## వ్యవసాయంలో అగ్రగామి

ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయం మూస పద్ధతిలో సాగింది. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఉద్యాన సాగు విస్మరణకు గురైంది. ఇప్పుడు వ్యవసాయంలో తెలంగాణ అగ్రగామిగా దూసుకుపోతున్నది. నేలల స్వభావం, తక్కువ నీటితో ఎక్కువ లాభాలు గడించే ఉద్యానపంటల సాగు దిశగా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్నది. మనకు అద్భుతమైన భూములు ఉన్నాయి. సాగునీరు పుష్కలంగా అందుతున్నది. మన నీళ్లను, మన భూములను సరిగ్గా వినియోగించుకుంటున్నాం. ఫలితంగా ఉద్యాన పంటలతో రైతులు మంచి లాభాలను పొందుతున్నారు.

▪ కేసీఆర్

---

# దోచుకోవాలని ప్లాన్ చేస్తున్నారు!

ఫటాఫట్ | Interview

**కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉండే మానవతా రాయ్‌కి టికెట్ ఎందుకు రాలేదు?**

**'ముందొచ్చిన** చెవుల కన్నా.. వెనుకొచ్చిన కొమ్ములు వాడి' అన్న సామెత గుర్తుకొస్తుంది. పార్టీ కోసం ప్రాణం పెట్టి పనిచేసిన నన్ను పక్కన పెట్టి పారాచూట్ నేతలకు టికెట్ ఇచ్చారు. సత్తుపల్లి నాదే అనుకున్నా. చివరికి మరొకరికి ఇచ్చారు. ఆమె స్థానికురాలు కూడా కాదు.

**బయట ప్రచారం జరుగుతున్నట్టే మీ విషయంలోనూ టికెట్ల అమ్మకాల ప్రభావం ఉందంటారా?**

**ముమ్మాటికీ** అంతే! కాంగ్రెస్‌లో జేబు చూస్తరు, కడుపు చూడరు. నా జేబులో డబ్బులు లేవు. నా గుండెలో కాంగ్రెస్ మీద ఉన్న ప్రేమ వాళ్లకు కనిపించలే! డబ్బు కట్టలు ఇచ్చినోళ్లకే టికెట్ ఇచ్చారు. పార్టీ కోసం పని చేసేవాళ్లు కాంగ్రెస్‌కు అవసరం లేదు. పార్టీ కోసం కష్టపడ్డవాళ్ల నోట్లో మన్నుకొట్టిన ఈ పార్టీ.. ప్రజల గురించి ఆలోచిస్తుందని నేనను కోను. అధికారంలోకి వస్తే.. ఏం దోచుకోవాలి, ఎన్ని కోట్లు వెనుకేసుకోవాలి అని ఇప్పుడే ప్లాన్ చేసుకుంటున్నారు.



మానవతా రాయ్

**2014, 2018లో కూడా మీకు టికెట్ మిస్ అయ్యింది కదా?**

**అప్పుడు** విద్యార్థులుగా ఉన్న మమ్మల్ని పక్కన పెడితే.. నేరుగా రాహుల్ గాంధీని కలిశాం. విద్యార్థి నేతలకు రెండు టికెట్లు ఇవ్వాలని చెప్పారు ఆయన. అదీ అమలు కాలేదు. బీసీ నేతలకు, విద్యార్థి నాయకులకు టికెట్ ఇవ్వాలన్న ఆలోచనే కాంగ్రెస్‌లో లేదు. నాలాంటి చాలామంది నాయకులకు అన్యాయం జరిగింది. కురువ విజయ్ కుమార్, బెల్లయ్య నాయక్, బల్మూరి వెంకట్ ఇలా చాలామంది ఉన్నారు. కనీసం అధిష్ఠానమో, రాష్ట్ర నాయకత్వమో ఒక ఫోన్ చేసి కూడా మాట్లాడలేదు. మా ఆత్మగౌరవం మీద దెబ్బకొట్టారు. మాలాంటి వాళ్లకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పాపం ఊరికే పోదు.

**నామినేటెడ్ పదవులు, టికెట్ల కేటాయింపులో బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి నాయకులకు తగిన గుర్తింపు ఇచ్చింది కదా!**

**ఉన్నమాట** చెప్పుకోవాలి. కేసీఆర్ గారు ముందు కడుపు చూస్తారు. కడుపు నింపే గుణం ఆయనది. ఉద్యమ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నేతలను పిలిచి అన్నం పెట్టేవాడు. 'డబ్బులున్నాయా, లేదా' అని ఆలోచించకుండా విద్యార్థి నాయకులకు సీట్లిచ్చి ప్రోత్సహించి అసెంబ్లీకి పంపారాయన. దటీజ్ లీడర్ క్వాలిటీ.

**ఇప్పటి వరకు మెడలో కాంగ్రెస్ కండువా లేకుండా మానవతారాయ్ మీడియాలో కనిపించడు. తొలిసారి ఇలా.. (ప్రశ్న పూర్తి కాకముందే..)**

**మెడలో** కాంగ్రెస్ కండువా లేని మానవతా రాయ్ మొదటిసారి కనిపిస్తున్నాడు. నెలలో నాలుగైదు కండువాలు కొనేంత అభిమానం ఆ పార్టీ మీద ఉండేది. నా ఆత్మ గౌరవాన్ని చంపేసిన తర్వాత.. పార్టీ మీద ప్రేమ కూడా చచ్చిపోయింది.

**ఇన్నాళ్లూ కాంగ్రెస్‌లో ఉన్న మీరు బీఆర్ఎస్ పార్టీలో చేరడాన్ని ఎలా సమర్థించుకుంటారు?**

**బీఆర్ఎస్** పిలుపు అందుకొని ఆ పార్టీలో చేరాను. నిజంగా చెప్పాలంటే ప్రస్తుతం ఎమ్మెల్యే టికెట్ గానీ, ఏదైనా పదవి గానీ ఇచ్చే పరిస్థితులు, అవకాశాలు లేవు. అయితే.. నా ఆత్మగౌరవానికి విలువ ఇచ్చి పిలిచారు. అందుకే బీఆర్ఎస్‌లో చేరాను!

**చివరిగా ప్రజలు, విద్యార్థులు, యువతకు మీరేం చెప్పదలుచుకున్నారు?**

**అందరికీ** ఒకటే చెప్తున్నా.. దయచేసి చెప్పుడు మాటలో, రెచ్చగొట్టే మాటలో నమ్మి మోసపోకండి. జేబులు చూసి విలువ ఇచ్చే పార్టీలను నమ్మకండి. కడుపు నింపే నాయకుడు, పార్టీని గెలిపించండి. నాలుగు మెతుకులు కడుపులోకి వస్తాయి. పిల్లల భవిష్యత్ బాగుంటుంది.

• సుంకరి

---

## ఖుల్లం ఖుల్లా

సమైక్యతే ముద్దట సొంత రాష్ట్రం వద్దట
అమరుల బలిదానాలకు విలువస్సలు లేదట
విద్రోహుల దుశ్చర్యలు చూసి ఊరుకోవద్దు
ఊరి పొలిమేర దాక తరుముదాం వదలొద్దు

ఉత్తుత్తి హామీలు హుషారుగా ఇస్తారు
ఏరు దాటాక అన్నీ హుష్ కాకి అంటారు
రైతన్నకు మూడు గంటల పవరు ఇస్తే చాలంటా
అడ్డగోలు పార్టీకి షాకిస్తే మేలంటా

... ✍ దండమూడి శ్రీచరణ్

---

దిల్ సే



పూల్యా నాయక్

# పూల్యా నాయక్ గెలిచాడు!

## గిరిజన రైతు ఇంట సంతోషాల పంట

సిరులు పండించే చేవ ఉన్నా.. అప్పుడు కరెంటు ఎక్కడిది? దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నా.. నీళ్లు ఇచ్చిన నాథుడేడి? నోరెళ్లబెట్టిన బోర్లు.. నెర్రెలు వారిన పొలాలు... పదెకరాల ఆసామి పూల్యా నాయక్‌ను కలవరపెట్టాయి. అయినవారిని కాదనుకునేలా చేశాయి. కన్నఊరిని వదిలి దేశం బాట పట్టేలా నెట్టేశాయి. ఎనిమిదేండ్లు అష్టకష్టాలు పడేలా చేశాయి.

ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్ప బలం.. వచ్చిన తెలంగాణను గెలిపించింది. అనంత జలసిరిని బీడు భూములకు మళ్లించింది. మాగాణాన్ని మురిపించింది. దేశం కాని దేశంలో కూలీగా బతికిన పూల్యా నాయక్‌ను సొంతూళ్లో స్థిరపడేలా చేసింది. ఎవుసంలో రారాజుగా నిలిపింది. ఉమ్మడి రాష్ట్రంలో కరువు పరిస్థితులకు తల్లడిల్లిన ఈ రైతు పొలం.. స్వరాష్ట్రంలో పంటసిరులతో తుళ్లిపడుతున్నది. కేసీఆర్ వల్లే తన తలరాత మారిందని చెబుతున్న పూల్యా నాయక్ 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్న జీవిత అనుభవాలు ఆయన మాటల్లోనే..

- పదెకరాల ఆసామికి నాడు పుట్టెడు కష్టం
- ఎనిమిదేండ్లు సౌదీలో వెట్టిచాకిరి
- ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు గోసలు
- కరువు తట్టుకోలేక సౌదీకి వలస
- తెలంగాణ రాకతో మారిన చిత్రం
- నీళ్లు రావడంతో మళ్లీ ఎవుసంలోకి

**నా** జీవితం తెలంగాణకు ముందు, తెలంగాణకు తర్వాత అని చెప్త. ఇయ్యాల నేను బాజాప్తా కష్టం చేసుకొని బతుకుతున్న. దానికి తగ్గ లాభం పొందుతున్న. మాది వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిన్నమందడి పంచాయతీ పరిధిలోని ధన్‌సింగ్ తండా! ఉమ్మడి కుటుంబానికి 30 ఎకరాల పొలం ఉంటుండే. అన్నదమ్ములం ఆస్తులు పంచుకుంటే.. నా వాటా కింద పది ఎకరాలొచ్చింది. గిప్పుడు పదెకరాలంటే కరోడ్‌పతి! అప్పుడేం ఉంటుండే.. భూమి ఎంతుంటే అంత ఎక్కువ అప్పులు అయితుండే! అప్పులు కట్టలేక.. పొలం అమ్ముకున్నోళ్లు ఎంతమందో! నా కిస్మత్ బాగుందేమో పొలం అమ్మలే!!

### పంటకో బోరు

అప్పట్ల ఎవుసం తప్ప చేసేందుకు మరో పని ఉండక పోవు. ఎంత కష్టం చేసినా ఎన్నడూ కాలం సక్కగ ఉండకపోవు! అదును చూసి వానలు పడకపోతుండే! పూడుకుపోయిన చెరువులల్ల నీళ్లుంటే ఒట్టు. గట్టి వాన పడితే.. కట్ట కొట్టుకుపోతుండే. వానలు పడకపోతే ఏడాదంతా ఎండిపోయి ఉంటుండే! ఎండకాలమొస్తే ఇగ కరువే! పొలమంతా ఎడారిలా ఉంటుండే!! కండ్లముందే ఎండిపోతున్న పంటలను చూసి దుఃఖం ఆగకపోయేది. నీళ్లు లేక సచ్చిపోతున్న పైరును కాపాడుకోవాలని లెక్కలేనన్ని బోర్లు వేసినం. వందల ఫీట్లు కొట్టిస్తుంటి. జరన్ని నీళ్లు పడ్డా మురిసిపోతుంటి. రెండు నెలలు తిరక్కముందే అవి ఎండిపోతుండే. పంటకో బోరు వేసి అప్పుల పాలైన. పది ఎకరాల్లో 20 బోర్ల దాకా ఏసిన. అప్పట్లనే లక్షలు ఖర్చుపెట్టిన.

### చేసేది లేక దేశం పోయిన

నేననే కాదు.. మా సుట్టుపక్కల రైతుల గోస కూడా గింతనే ఉంటుండే! కిస్మత్ ఖులాయించి బోర్ల నీళ్లుంటే.. ఈ కరెంటు అరిగోస పుచ్చుకుంటుండే. గా కరెంటు కష్టాల గురించి ఎంత చెప్పినా తక్వనే! ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వకపోతుండే. మోటర్ చాల్ అయినంక గంట నడిస్తె గొప్ప. రెండు మడులు నీళ్లు పెట్టినమో లేదో.. కరెంటు పోతుండే. మల్లా ఏ రాత్రికో వస్తుండే.. పారిన మడే పారుతుండే! గిదేం బతుకురా అనుకోని దినం లేదు. చేసిన కష్టమంతా నేలపాలు అయితుండే! ఎండిపోయిన పొలాల్లోకి బర్లు, మేకలను మేతకు తోలుతుంటి. అప్పుడు కండ్లపొంటి రక్తమొచ్చినట్టు అయితుండే. చేతికి రాని పంట గురించి ఏం ఆలోచిస్తం. మా గాచారం గింతేనని పశువులను పొలంలో ఇడ్సిపెట్టేది. ఆ రోజుల్ల గోజలు గిన నరకం అనుభవించినయి. చెరువులు, కుంటల్లో పశువులకు తాగనీకి నీళ్లు కూడా ఉండకపోతుండే. మా కష్టం చెప్తే రామాయణమంత! తిండి పుట్టుడే కష్టమైతుండే. గంజి తాగి ఆకలిని చంపుకొన్న రోజులున్నయి. అవీ లేకపోతే నేను పస్తుండేటోడ్ని! ఇంకా ఎన్ని దినాలు గివన్ని భరిస్తం. నేను పస్తున్నా.. నా భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకును సక్కగ చూసుకోవాలి గదా! అందుకే, ఇగ ఎవుసం నడవదని సౌదీకి పోయిన. 2002లో దేశం దారి పట్టిన. ఎనిమిదేండ్లు అక్కడ గొడ్డు చాకిరి చేసిన. పదెకరాలున్నా గిదేం బతుకని బాధపడని దినం లేదు. 2010లో మళ్లీ ఊరికొచ్చిన. నేను మల్లొచ్చేసరికీ గవే పరిస్థితులు! అభిమానం సంపుకొని మళ్లీ దేశం పోబుద్ధి కాలే! ఎంతో కొంత ఎనకేసుకున్న. అయ్యేదేదో అయితదని ఈడనే ఉండాలనుకున్న. నాలుగేండ్లు తిప్పలు పడ్డా. తెలంగాణ వచ్చినాంక.. మెల్లగ ఊరు తెల్లవడ్డది. కేసీఆర్ సారు పట్టుబట్టి నీళ్ల సౌలత్ చేసుడుతోని రంది పోయింది. పెట్టుబడి సాయం అందుతున్నది. కాలం గూడా మంచిగైతున్నది. తెలంగాణ వచ్చిన రెండేండ్లకే నా పొలం పచ్చవడ్డది.

> **• సొంతూరులోనే సేద్యం**
>
> **తెలంగాణ** వచ్చినంక అన్ని సమస్యలు తీరినయి. సొంతూరులోనే సేద్యం చేసుకుంటూ కుటుంబంతో హాయిగా ఉంటున్న. గిప్పుడు 24 గంటల కరెంటు వస్తున్నది. మా ఇద్దరు బిడ్డలకు పెండ్లిండ్లు అయినయి. వాళ్లకు కల్యాణలక్ష్మి వచ్చింది. ఇంకో ఇద్దరు సర్కారు బడిలనే చదువుతున్నరు. నాబార్డ్ నుంచి ట్రాక్టర్ తీసుకుంటే మూడున్నర లక్షల సబ్సిడీ వచ్చింది. రైతుబంధు ఏడాదికి లక్ష రూపాయలు వస్తున్నయి. సీఎం కేసీఆర్ సారుకు చేతులెత్తి దండం పెట్టాలె.

### చేతినిండా పని..

గతంల బతుకుదెరువు కోసం సౌదీకి పోయిన నేను... తెలంగాణ అచ్చినంక ఈ పదేండ్లు తండాను ఇడిసిపెట్టి పోలే. ఈడనే ఉంటున్న. కేసీఆర్ పాలనలో నీళ్ల గోస తీరింది. కల్వకుర్తి అయిపోవుడుతోని మా కష్టాలు పోయినయి. బుద్ధారం కాల్వ నుంచి గార్లకుంటకు నీళ్లొచ్చినయి. మా తండాతోపాటు చుట్టుపక్కల పొలాలూ సాగులోకి వచ్చినయి. బోర్లు ఆగకుంట నీళ్లుపోస్తున్నయి. నా పొలంల ఉన్న బోర్లు ప్రాణం పోసుకున్నయి. నాలుగు బోర్ల నీళ్లతో పదెకరాలు పండిస్తున్న. ఐదు ఎకరాలల్ల వరి ఏస్తున్న. మామిడి తోట కూడా పెట్టిన. టమాట, మిర్చి,



కూరగాయలు అంతరపంటలు పండిస్తున్న. ఒక ఎకరంలో బర్ల షెడ్డు, ఇల్లు కట్టుకున్న. ఎవుసంతో పాటే 30 బర్లను సాదుతున్న. ఈ సీజన్‌లో 500 బాక్సుల టమాట అమ్మిన. ఇంకా వెయ్యి బాక్సుల టమాట ఎల్తది. దినాం 40 లీటర్ల పాలు పోస్తున్న. పొద్దంతా పనిలనే ఉంటున్న. నాలుగు పైసలు కండ్ల చూస్తున్న. కాంగ్రెసోళ్లు ఉన్నప్పుడు దండుగ అనుకున్న ఎవుసం కేసీఆర్ దయతోని పండుగైంది. గిప్పుడు కరెంటు పోవుడు ముచ్చట లేదు. పొద్దంత, రాత్రంత ఉంటున్నది. ఎప్పుడంటే అప్పుడు నీళ్లు పారించుకునే సౌలత్ చేసిన కేసీఆర్ సారు రుణం తీర్చుకోలేం. నా ఒక్క పొలమే కాదు.. చుట్టుపక్కల ఎక్కడ చూసినా పచ్చటి పొలాలే కనిపిస్తున్నయి. ముఖ్యమంత్రి పట్టుదలతోనే గిదంత సాధ్యమైంది. నా కష్టాలన్నీ తీరినయి. చేతినిండా పనితో, గుండెనిండా సంతోషంతో హాయిగా బతుకుతున్న. నా తలరాత మార్చిన కేసీఆర్ సారు ఎంబటే నా కుటుంబం ఉంటది. మా రైతన్నల నసీబు మారిందంటే ఆయన చలువ వల్లనే!! మేమంతా ఆయనతోనే ఉంటం. కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకుంటం.

... ✍ వంగూరు నరసింహారెడ్డి

---

ఎటుమంటం!

# లోపాయికారీ కూటమి

**ఎన్నికలలో** ఇంతవరకు మనం మిత్ర పక్షకూటమి, వామపక్ష కూటమి, మహాకూటమిల గురించే విన్నాం. కానీ ఈసారి మరో కూటమి తెరపైకి వచ్చింది. అదే లోపాయికారీ కూటమి. అధికారికంగా ప్రకటించకుండా మద్దతు పలకడాన్ని లోపాయికారీ కూటమిగా చెప్పుకోవచ్చు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలో టీడీపీ, సీపీఐ, తెలంగాణ జన సమితి (టీజేఎస్), తెలంగాణ ఇంటి పార్టీ కలిసి మహాకూటమిగా ఏర్పడి పోటీకి దిగాయి. ప్రస్తుతం అలాంటి కూటమి ఏదీ బయటికి కనిపించనప్పటికీ కాంగ్రెస్‌తో ఒక్క సీపీఐ మాత్రమే అధికారికంగా పొత్తు పెట్టుకున్నది. మరోవైపు తెలంగాణలో జరిగే ఎన్నికల్లో తాము పోటీకి దూరం అని ప్రకటించిన టీడీపీ, లోపాయికారీగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఏకంగా టీడీపీ కండువాలు కప్పుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. మిగతా చోట్ల కండువాలు కప్పుకోకపోయినప్పటికీ వారికి మద్దతుగా స్థానిక టీడీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. కాగా తమకు కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు లేదని సీపీఎం ప్రకటించినప్పటికీ ఆ పార్టీ అభ్యర్థులకు సీపీఐ మద్దతు ప్రకటించింది. అలాగే సీపీఐ బరిలో లేని చోట బీజేపీని అడ్డుకునేందుకు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామనీ పేర్కొన్నది. తెలంగాణ జనసమితి అధినేత కోదండ రామ్ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. గత ఎన్నికల నాటి మహాకూటమిలోని పార్టీలన్నీ ఈసారి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కాంగ్రెస్‌కే మద్దతు పలుకుతుండగా, అదనంగా సీపీఎం కూడా పరోక్ష మద్దతు ప్రకటించింది. అనధికారికంగా జతకట్టిన లోపాయికారీ కూటమిని బీఆర్ఎస్ సింగిల్‌గా ఎదుర్కొంటున్నది.

• వెల్జాల

